ప్రజాశక్తి
మంగళవారం 06 మే 2025
5
కర్నూలు





మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

ఎంఎస్ఎంఇ పార్కు ప్రారంభం

- అనంతపురం టు కర్నూల్ ఇండస్ట్రియల్ జోన్
- ఓర్వకల్ పారిశ్రామిక వాడ లో పెట్టుబడులు - పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ముందుకు వస్తున్నాయని పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ అన్నారు. అనంతపురం టు కర్నూలు ఇండస్ట్రియల్ జోన్ కూడా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. సోమవారం ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఇ పార్కును మంత్రి ప్రారంభించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి టిజి. భరత్ ,జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న 175 నియోజకవర్గాలలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలోని యువతకు శిక్షణ కార్యక్రమాలు నేర్పించి స్థానికులకు ఉద్యోగాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓర్వకల్లులో పైలట్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పార్కుకు అవసరమైన దూపాడు- బేతంచెర్ల రైల్వే స్టేడింగ్‌కు అనుమతులు వస్తున్నాయని తెలిపారు. అనంతపురం- కర్నూలు ఇండస్ట్రియల్ జోన్ చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఇ పార్క్ ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. చిన్న తరహా పరిశ్రమల పార్కులు, స్టార్టప్ లు ఆ విధంగా ఎవరైతే ఎంఎస్ఎంఇలుగా మారాలనుకుంటున్నారో వారందరికీ ఒక అవకాశం కల్పించేందుకు గాను ఏదు నియోజకవర్గాలలో భూమిని గుర్తించామన్నారు. ఈరోజు మొట్టమొదటిగా జిల్లాలో ఉన్నటువంటి 7 నియోజకవర్గాలలకు గాను పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు మండలంలోని గుట్టపాడు గ్రామంలో ఎంఎస్ఎంఇ పార్కును ప్రారంభించుకున్నామన్నారు. ఓర్వకల్లు మండలం చాలా అభివృద్ధి చెందుతున్న మండలమని కలెక్టర్ తెలిపారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో పైలెట్ శిక్షణ కేంద్రాలను తీసుకొని వచ్చేందుకు మంత్రి భరత్ కృషి చేస్తున్నారన్నారు. అదే విధంగా 15 ఎకరాలలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుండి రూ.2 వేల కోట్లతో ఇండస్ట్రియల్ నోడ్‌ను అభివృద్ధి చేస్తున్నారన్నారు.. స్వయం సహాయక సంఘాలు జ్యూట్ బ్యాగ్స్, మ్యాట్స్ లాంటి తదితర వస్తువులు ఫారిన్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు.. స్వయం సహాయక సంఘాల సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షుడు ,టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, కర్నూల్ ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, పరిశ్రమల శాఖ జిఎం అరుణ కుమారి, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మండల సీనియర్ నాయకులు సీఎస్ సుధాకర్ రెడ్డి ,టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు, సర్పంచ్ మోహన్ రెడ్డి తహశీల్దార్ విద్యాసాగర్, ఎంపిడిఒ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీనియర్లకు మొండి చెయ్యి..!

- అనుకూలమైన వారికే కీలక పదవులు
- ఆర్‌యు ఉన్నతాధికారుల శైలిపై మండిపాటు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



రాయలసీమ యూనివర్సిటీలో సీనియర్ ప్రొఫెసర్లకు కీలక పదవులను కట్టబెట్టకుండా ఉన్నతాధికారులు పక్కన పెట్టడం పట్ల చర్చ నియాంశమైంది. వర్సిటీలో ఉన్నతాధికారు లకు అనుకూలమైన వారికే కీలక పదవులను కట్టబెట్టారు. ఈ పదవుల కేటాయింపు పట్ల ఉన్నతాధికారుల వ్యవహార శైలి పట్ల ప్రొఫెసర్లు , విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. రాయలసీమ యూనివర్సిటీలో ఇటీవల రెండు రోజుల క్రితం పలువురు ప్రొఫెసర్లకు పదవుల కేటాయిస్తూ విసి వెంకట బసవరావు ఉత్తర్వులను జారీ చేశారు. వర్సిటీలోని ఆర్ట్స్ ,సైన్స్ కళాశాలలకు వేరువేరుగా ప్రిన్సిపల్స్ ఉండేవారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ గా ప్రొఫెసర్ నరసింహులు, కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ సివి.కృష్ణారెడ్డి బాధ్యతలను నిర్వహించేవారు. ఇప్పుడు సైన్స్, ఆర్ట్స్ కళాశాలలను ఒకే గొడుగుకిందికి తెచ్చి ఆరేయు కళాశాల ప్రిన్సిపల్‌గా సివి కృష్ణారెడ్డిని నియమించారు. వర్సిటీలో మరో కీలకమైన పదవి సిడిసి డీన్‌గా ప్రొఫెసర్ సుందరానందపుచ్చాను నియమించారు. సిడిసి డీన్ పదవి అవినీతి అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉంటుంది. కళాశాలలు యూనివర్సిటీ ఎ.అఫిలియేషన్ గుర్తింపు జారీ చేసేది సిడిసినే మొన్నటివరకు సిడిసి డీన్ ప్రొఫెసర్ సివి కృష్ణారెడ్డి వ్యవహరించారు. ఇటీవల కాలంలో ఆయనపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు రావడంతో మార్చేశారు. ఇప్పుడు సుందరానంద పుచ్చకు సి డిసి డీన్ పదవి కట్టబెట్టడం పట్ల వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది. ప్రొఫెసర్ల అక్రమ నియామక కేసు సుప్రీంకోర్టులో నడుస్తుంది. ఇందులో ఆయన కూడా ఉన్నారు. వర్సిటీలో మరో కీలకమైన హాస్టల్స్ చీఫ్ వార్డెన్ పదవిని ప్రొఫెసర్ ఎన్ నరసింహులుకు కట్టబెట్టారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్న నరసింహులను తీసేసి చీఫ్ గార్డెన్‌గా నియమించారు. వర్సిటీలో మరో ప్రొఫెసర్ విశ్వనాథ్ రెడ్డికి రీసెర్చ్ డైరెక్టర్ పదవిని కట్టబెట్టారు. గతంలో హాస్టల్ చీఫ్ వార్డెన్ గా వ్యవహరిస్తున్న ఆయనను అక్కడినుండి తప్పించారు. ఇప్పుడు వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్‌గా నియమించారు. వివాదాలు కలిగినటువంటి ప్రొఫెసర్లకు ఇలాంటి పదవులను కట్టబెట్టడం పట్ల వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ కొనసాగుతుంది. వర్సిటీ ఉన్నతాధికారుల తీరు పట్ల విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ నియామకాలను రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సీనియారిటీ పరిగణనలోకి తీసుకున్నాం

- డాక్టర్ బి విజయ్ కుమార్ నాయుడు, రిజిస్ట్రార్ రాయలసీమ వర్సిటీ

రాయలసీమ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లకు పదవుల కేటాయింపునకు సంబంధించి సీనియారిటీ పరిగణనలోకి తీసుకున్నాం. విశ్వవిద్యాలయాల్లో పరిపాలనలో అమలవుతున్న విధానాన్ని ఇక్కడ కూడా అదే విధానాన్ని అమలు చేశాం. సీనియారిటీ ప్రకారం ప్రొఫెసర్లకు పదవులను కేటాయించాం.



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న నాయకులు

ఆదివాసులపై దాడులు ఆపాలి

- శాంతి కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట వామపక్షాల నిరసన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వం ఆదివాసీలపై దాడులను ఆపి తక్షణమే కాల్పుల విరమణ పాటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాల శాంతి కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం శాంతి కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్ నుండి కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. సిపిఎం ,సిపిఐ నగర కార్యదర్శిలు రామకృష్ణారెడ్డి, రాజశేఖర్ అధ్యక్షత వహించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి గిద్దయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, ప్రభుత్వం మావోయిస్టుల పేరుతో చేస్తున్న దాడులలో అమాయక ఆదివాసీలు బలై పోతున్నారన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో 24 వేల మంది సైన్యంను దింపి కర్రెగుట్టల్లో మావోయిస్టులే లక్ష్యంగా దాడులు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే కాల్పుల విరమణ పాటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ అంతిమ యుద్ధం పేరిట గత జనవరి నుండి ఇంతవరకు ఐదు వందల మంది ఆదివాసీలు, మహిళలకు బలి తీసుకున్నదని, రాజ్యాంగ హక్కులు అందరికీ సమానంగా వర్తిస్తాయని, కర్రె గుట్టలపై వున్న ఇరవై వేల మంది సైనిక బలగాలను వెనక్కు తీసుకుని, శాంతి చర్చలకు చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి ఆనంద్ బాబు, టి .రాముడు జిల్లా నాయకులు సిహెచ్ సాయి బాబా. ఆర్ నరసింహులు గురు శేఖర్, ప్రజా అభ్యుదయ సంస్థ నాయకులు శ్రీనివాసరావు జిల్లా పౌరహక్కుల సంఘం కార్యదర్శి అల్లా బకష్ , రైతు కూలీ సంఘం నాయకులు నుంకన్న పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌పై నివేదిక ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పిజిఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలన్నారు. రీఓపెన్ అయిన అర్జీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. సిఎంఒ గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

నేటి యువతకు ఆదర్శం కారల్‌మార్క్స్

- సిఐటియు ఆధ్వర్యంలో మార్క్స్ జయంతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నేటి యువతకు కారల్‌మార్క్స్ ఆదర్శప్రాయుడని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు అన్నారు. కర్నూల్ నగరంలోని 32 వ వార్డు ముజఫర్ నగర్‌లో సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మేడే వారోత్సవాల భాగంగా పాట, ఆట మాటసభ నిర్వహించారు. ఈ సభకు సిఐటియు నగర కార్యదర్శివర్గ సభ్యులు కె. సుధాకరప్ప అధ్యక్షత వహించారు. సభ ప్రారంభానికి ముందు మేడే వారోత్సవ సభలో కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్ నరసింహులు, నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా, నగర నాయకులు టిరాముడు కె.ప్రభాకర్ వార్డు కార్యదర్శి ఎంసి ఆనంద్‌లు మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, జిల్లా అధ్యక్షుల పిఎస్.రాధాకృష్ణ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా దోపిడీ లేని సమాజం కోసం పరితపించిన మహోన్నతుడు, మార్క్సిస్టు మేధావి కారల్ మార్క్స్ అని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభమే కార్మికుల జీవితం బానిసత్వంగా ఉంటుందని, తన పెట్టుబడి గ్రంథంతో సమాజ గతిని మార్చిన మహానాయకుడు మార్క్స్ అని కొనియాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి పెట్టుబడిదారులకు అనుకూల పాలనచేస్తున్నారని, పెట్టుబడిదారులకు బానిసలుగా కార్మికుల జీవితాలను మార్చే ప్రయత్నం చేస్తున్నారని అందులో భాగంగానే కార్మిక చట్టాలని నిర్వీరం చేసే ప్రయత్నం చేస్తున్నారని వారు విమర్శించారు. 44 కార్మిక చట్టాలను 4లేబర్ కోడ్లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. . మార్క్స్ స్ఫూర్తితో మేడే సందర్భంగా ప్రజలందరూ ప్రతిజ్ఞ పూనాలని కేంద్రంలోని ప్రజా కార్మిక వ్యతిరేక పాలన చేస్తున్న మోడీకి వ్యతిరేకంగా భవిష్యత్తులో ప్రజలందరూ పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా కార్మిక కర్షక రైతు ఉద్యోగ సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు హుస్సేన్ బాష, ఎస్ఎండీ మహమ్మద్ రఫీ, హుస్సేన్‌వలి, జి.ఏసు, భాస్కర్, వార్డు నాయకులు సురేష్, శ్రావణ్, బీసన్న, వెంకటేశు, మహేష్, రాజు, ఆర్ వెంకటేష్, ఐస్వామి మహిళలు దానమ్మ లక్ష్మీబాయి ధనలక్ష్మి సాలమ్మ ప్రజానాట్యమండలి కళాకారులు రాజు బతుకమ్మ వారి మిత్ర బృందం పాల్గొన్నారు.



కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శమంతకమణి

క్రీడాకారులను ప్రోత్సహించాలి

-మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి-తైక్వాండో క్రీడాకారులకు సత్కారం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

క్రీడాకారులను ప్రోత్సహించడం మంచి పని అని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు. జిల్లా క్రీడాపాధికార సంస్థ లోని యోగ హాలులో మాస్టర్ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో శిబిరాలలో పాల్గొంటున్న క్రీడాకారులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ విద్యా సంవత్సరంలో జాతీయస్థాయి తైక్యాండో పోటీలతో పాటు తైక్వాండో సాయి హాస్టల్ కు ఎంపికైన నలుగురు క్రీడాకారులకు ముఖ్యఅతిథి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి పతకాలను అందించి ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో సతీష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరాలలో శిక్షణ తీసుకుంటున్న తైక్వాండో క్రీడాకారులు ఉన్నత స్థాయి పోటీలతో పాటు సాయి హాస్టల్ కు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులు విద్యకి పరిమితం కాకుండా ఇటువంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న మాట్లాడుతూ ఈ క్రీడను మరింత ఉన్నత స్థితికి తీసుకోవచ్చేందుకు తన వంతు సహకారంగా కళాశాలలో ఒక రూమును ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసులు తైక్వాండో మాస్టర్స్ సతీష్ కుమార్, వీరేష్ , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


డిప్యూటీ డిఇఒను కలిసిన యుటిఎఫ్ నాయకులు రవికుమార్, నవీన్‌పాటి

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

డిప్యూటీ డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యుఆర్ఎ రవికుమార్ ,బి నవీన్ పాటి, సహాధ్యక్షుడు జి. హేమంత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు డిప్యూటీ డిఇఒ రాజేంద్రప్రసాద్‌ను యుటిఎఫ్ జిల్లా ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కర్నూలు డివిజన్‌లో ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను డిప్యూటీ డిఇఒ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని,వివిధ రకాలుగా కరెంటు బిల్లులు పెంచరాదని కోరుతూ కర్నూలు నగరం జోహారాపురం 18వ వార్డులో శాఖ కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన వార్డు ప్రజలతో సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 'స్మార్ట్ మీటర్ వద్దు కరెంటు బిల్లులు పెంచరాదు. అని ఉన్న స్టిక్కర్లను ఇండ్లకు అతికించారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు విజయ రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని టిడిపి నాయకులు లోకేష్, విద్యుత్ బిల్లులు పెంచబోమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రజలకు ఇచ్చిన మాట తప్పారన్నారు. స్మార్ట్ మీటర్లను ప్రజలకు అంటగట్టే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ప్రజలను చైతన్యం చేస్తుందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతులను మోసం చేస్తూ రైతులకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నాన్ని వామపక్ష పార్టీల రైతు సంఘాల పోరాటాల వలన రైతులు చైతన్యవంతంగా ఉన్నారని తెలుసుకున్న టిడిపి నాయకత్వం స్మార్ట్ మీటర్లను పగలగొట్టి మా ప్రభుత్వం వస్తే రద్దు చేస్తామని చెప్పిందన్నారు. వైసిపి ప్రభుత్వం అదానితో ఒప్పందం చేసుకొని రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని ప్రచారం చేసిన టిడిపి నాయకత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం అదాని ఒప్పందం కోసం రూ.1750 కోట్ల లంచం తీసుకుని ఒప్పందం అమలు చేసిందన్నారు. జగన్‌పై కేసునమోదైనా జైలుకు పంపకుండా మౌనంగా ఉండడమే కాకుండా ఈ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను రైతులకే కాకుండా కమర్షియల్ షాపులకు, ప్రజల నివాసాలకు అమలు చేయడానికి పూనుకున్నారన్నారు. అదానితో ఒప్పందాన్ని రద్దుచేసి ప్రజలకు తక్కువ ధరతో నాణ్యమైన కరెంటు ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. లేని పక్షాన ప్రజలందరిని సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నియకులు తిప్పన్న, కృష్ణ, సుధాకర్, మాసూమ్, సంసోను, వెంకటేశ్వర్లు, వీరేష్, ప్రసాద్, ఇమ్మానేలు , కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్లు వద్దు అనే పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

పరిశుభ్రతతో ఆరోగ్యం

-డాక్టర్ రఘు, జిల్లా నోడల్ ఆఫీసర్

-ప్రపంచ చేతి పరిశుభ్రత దినోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్ : కోడుమూరు కోలోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమన్ని జిల్లా నోడల్ ఆఫిసర్ డాక్టర్ రఘు తనిఖీ చేశారు. ప్రపంచ చేతుల పరిశుభ్రతదినోత్సవం సందర్భంగా మాట్లా డుతూ చేతులను సబ్బుతో శుభ్రంగా కడుకుంటె అంటువ్యాధులు రాకుండా నివారించగల ఒక సులభమైన మార్గమని తెలిపారు. ముఖ్యంగా తినడానికి ముందు, మల, మూత్ర, విసర్జన చేసిన తరువాత, ముక్కు చీదిన తరువాత, ఏదేని తిను బండరాలను చేతిలో తీసుకొనేముందు, తినే ముందు అనారోగ్యంగా ఉన్నవారికి సేవచేసే ముందు తరువాత, వంట వండే ముందు కూరగాయలు లేక ఏదేని వంట సామాగ్రి తాకే ముందు, తుమ్మిన, దగ్గినా, ముక్కులను శుభ్రం చేసినా తరువాత, పిల్లల మలం శుభ్రం చేసిన తరువాత, పిల్లలు ఆటలాడిన తరువాత, ఎదిగిన ఆడ పిల్లలైతే శానిటరీ ప్యాడ్స్ మార్చుకున్న తరువాత ,ప్యాడ్ పడవేసిన తరువాత, జంతువులు వాటి వ్యర్థాలు తాకిన తరువాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. వైద్యులు శ్రీమంత్ మాదన్న , ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప , పర్యవేక్షకులు ఉమా బాయి , ఆరోగ్య కార్యకర్త నాగసువర్ణ , మగ ఆరోగ్య కార్యకర్తలు జయకుమార్, కిరణ్ కుమార్ సింగ్ , ఆశా కార్యకర్తలు ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.



కర్నూలు కమిషనర్ పై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

15వ ఆర్థిక సంఘం కింద దాదాపు రూ.65 లక్షలు నిధులు మంజూరై టెండర్ కూడా పూర్తైనప్పటికీ మురుగు కాలువల నిర్మాణం ఎందుకు ప్రారంభించడం లేదని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు పై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం సమర్పించారు. నగరపాలక సంస్థ పరిధిలోని శివారు కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎండి యూనిస్, సివివర్మ, ఎస్.అన్వర్ బాషలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం శాంతినగర్ కాలనీలో మురుగు కాలువల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజురై టెండర్ పూర్తి అయిన కాలువల పనులు ప్రారంభించ లేదని కలెక్టర్‌కు చెప్పారు. ఐదు కాలనీల ప్రజలుకు ఉపయోగపడే 100 అడుగుల రిచ్మండ్ కాలనీ రోడ్డు, సంతోష్ నగర్ సమీపంలో రహమత్ నగర్‌లో రోడ్లు వేయాలని కోరారు. ఆర్థిక సంఘం నిధులు మంజూరైనప్పటికీ పనులు ఎందుకు ప్రారంభించడం లేదని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నగరపాలక సంస్థ కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం వారు కొన్ని నెలల నుండి ఈ సమస్యను తన దష్టికి తీసుకువస్తున్నారన్నారు.. ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేయాలన్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ లో నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ కాలువ నిర్మాణానికి రేడియో స్టేషన్ గోడ అడ్డు వస్తుందని.. వారం లోపుగా శాంతినగర్ కాలనీ మురుగు కాలువ పనులు ప్రారంభిస్తామని కలెక్టర్‌కు తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్‌ను పిపిఎస్ఎస్ నాయకులు అభినందనలు తెలిపారు.


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు పుల్లారెడ్డి


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ ఎస్.రవీంద్రబాబు

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

నగరపాలక కమిషనర్ యస్.రవీంద్రబాబు-ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 8 అర్జీలు

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 8 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల సమస్యలను అడిగి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎస్ఇ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఒ జునైద్, ఎంఇలు శేషసాయి సత్యనారాయణ, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ పోరాటంతో కులగణన

నంద్యాల డిసిసి అధ్యక్షులు లక్ష్మీనరసింహయాదవ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నరేంద్ర మోడీ ప్రభుత్వం కుల గణన ప్రకటించడానికి రాహుల్ గాంధీ చేసిన పోరాటమే కారణమని , సామాజిక న్యాయం జరగాలని కోరుకుంకుంటున్నామని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు ఎఐసిసి మెంబర్ జె లక్ష్మి నరసింహ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అత్యున్నత సమావేశాల్లో కూడా చర్చించినట్లు ఆయన తెలిపారు. రాహుల్ గాంధీని 'సామాజిక న్యాయ దార్శనికుడు'గా అభివర్ణించారు. సోమవారం రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దేశంలో ఓబీసీల జనాభా లెక్కలు లేకపోవడం వల్ల వారికి అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని తెలిపారు. వెంటనే దేశవ్యాప్త కుల గణన చేపట్టాలని, తద్వారా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఓబీసీలకు జనాభా దామాషాలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కులగణన చేయడం వల్ల అన్ని కులాల వారికి ఎంత రిజర్వేషన్ ఇవ్వాలో తెలుస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కుల గణన ప్రకటనను స్వాగతిస్తున్నప్పటికీ, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని రద్దు చేయాలని, ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని కోరుతున్నారు. ఈడబ్ల్యూసి రిజర్వేషన్ అందరికీ సమన్యాయం జరగాలంటే కులగనన జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రజాక్ వలి, అసంఘటిత కార్మికుల జిల్లా అధ్యక్షుడు పఠాన్ హబీబ్ ఖాన్, నంద్యాల పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, కల్లూరు మండల అధ్యక్షుడు చెన్నయ్య, ఓర్వకల్లు మండల అధ్యక్షుడ విశ్వేశ్వర్ రెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, శేఖరు, గోవిందు, బాష ప్రతాపు నవీదు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

అకాల వర్షాల వల్ల నష్టపోయిన వరి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో ఆదోని, కౌతాళం తదితర మండలాల్లో వరి పంట సాగు చేశారని, చేతికొచ్చే దశలో అకాల వర్షాల వల్ల వరి ధాన్యం నేలపాలైందని తెలిపారు. ఎకరాకు దాదాపు 5 కింటాళ్ల వరకు వరి ధాన్యం వర్షం పాలైందని, మరోపక్క అరకొరగా వచ్చిన పంటను తక్కువ ధరకు మిల్లు యజమానులు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. వరి ధాన్యం ధర క్వింటాకు కేవలం రూ.1,600 ఇస్తున్నారని, కనీస మద్దతు ధర రూ.2,100 అమలు కావడం లేదని తెలిపారు. క్వింటాకు రూ.600 ప్రతి రైతూ నష్టపోతున్నారని, తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. అలాగే ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, జిల్లా నాయకులు బాష, ఈరన్న, అయ్యప్ప, మండల నాయకులు దావీదు పాల్గొన్నారు.

రూ.4 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని రూరల్


భూమిపూజ చేస్తున్న నాయకులు

మండలంలోని పెద్ద పెండేకల్ గ్రామం నుంచి సుమారు 4 కిలోమీటర్ల మేర రూ.4 కోట్ల నిధులతో నూతన బిటి రోడ్డు, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. సోమవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ రోడ్డు వేయడం వల్ల 4, 5 గ్రామాల ప్రజలు నేరుగా కర్నూలు నగరానికి వెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ రోడ్డు మీద వెళ్తే కర్నూలు దూరం కాస్త తగ్గి ప్రజలకు ఉపయోగకారంగా ఉంటుందని చెప్పారు. ఆదోని పట్టణాన్ని అభివృద్ధి చేయడం ఎంత ముఖ్యమో, గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టడం చాలా ముఖ్యమని తెలిపారు. టిడిపి ఇన్‌ఛార్జ్ కె.మీనాక్షి నాయుడు, మాజీ ఇన్‌ఛార్జ్ గుడిసె ఆది కృష్ణమ్మ, భూపాల్ చౌదరి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ఎన్‌టిఆర్ హౌసింగ్ స్కీం కింద నిర్మిస్తున్న గృహాలను సత్వరమే పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటదాసు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్ డిఇ ఆదినారాయణ, పట్టణ పరిధిలోని హౌసింగ్ ఎఇ శివమూర్తి, ఆమ్యూనిటీస్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని మండగిరి పరిధిలో ఉన్న ఢణాపురం వద్ద సుమారు 5,101 గృహాలు నిర్మాణం జరుగుతోందని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల కొన్ని గృహాలకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని చెప్పారు. 173 మంది లబ్ధిదారులు కట్టడాల వద్ద ఫేస్ ఐడెంటిఫికేషన్ ఫొటో తీయించుకోవాల్సి ఉంటుందన్నారు. కొందరు చనిపోవడం, మరికొందరు అందుబాటులో లేకపోవడం వల్ల బిల్లుల చెల్లింపు సాధ్య పడడం లేదని తెలిపారు. పూర్తయిన గృహాలను త్వరలోనే లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గృహాలు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. స్థలానికి సంబంధించిన పట్టా, ఆధార్ కార్డును లబ్ధిదారులు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. వార్డుల వారీగా సమీక్ష నిర్వహించి పెండింగ్ లబ్ధిదారుల వివరాలను సేకరించి, మూడు రోజుల్లోపు సాంకేతిక పరమైన సమస్యలను అధిగమించేలా చొరవ చూపాలని చెప్పారు.


సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

గ్రామీణ రహదారులు అధ్వానం..!

- ఆర్‌టిసి బస్సు సౌకర్యం కరువు
- ప్రయివేట్ దోపిడీకి అడ్డేది..?

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేదు. రవాణా సౌకర్యం లేక మండల వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, అధికారులు రవాణా సౌకర్యంపై శ్రద్ధ చూపకపోవడంతో మారుమూల ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లు సరిగ్గా లేకపోవడంతో ఆర్‌టిసి బస్సు సౌకర్యం కరువైంది. ప్రయివేట్ వాహనాల యజమానులు అందినకాడికి దోచుకుంటున్నారు.


రాళ్లు తేలిన సిద్ధాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు

మండలంలోని చింతకుంట నుంచి కొక్కరచెడు గ్రామానికి వెళ్లే రహదారి ప్రాంతంలో సుమారు 7 కిలోమీటర్ల మేర లేదు. బురద రోడ్లపైనా, ప్రమాదకరంగా ఉన్న రోడ్లపైనా ప్రయివేట్ వాహనాల్లో ప్రజలంతా ప్రయాణం కొనసాగిస్తున్నారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆర్‌టిసి బస్సు సేవలు కూడా ప్రజలకు అందడం లేదు. మరోవైపు హాలహర్వి నుంచి మాచనూరు వెళ్లే రహదారిలో ఉరి వాగు తెగి పడింది. సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. మరోవైపు గూళ్యం నుంచి సిద్ధాపురం మీదుగా బల్లూరు వరకు దాదాపు 8 కిలోమీటర్ల మేర గుంతలమయంగా ఉంది. ప్రయాణికులు ఇబ్బందులు పడుతూనే గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. గతంలో రవాణా వ్యవస్థ లేక గర్భిణులు మార్గమధ్యంలో ప్రసవించిన సంఘటనలూ ఉన్నాయి.

'ప్రయివేట్' దోపిడీకి అడ్డేది..?

చింతకుంట నుంచి మల్లికార్జునపల్లి వరకు 10 నుంచి 15 కిలోమీటర్ల మేర దూరానికి ప్రయివేట్ వాహన దారులు ఇష్టానుసారంగా ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయివేట్ వాహనాదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు.

పట్టించుకోని పాలకులు, అధికారులు

మండలంలో రవాణా సౌకర్యం మెరుగుపడేందుకు.. రహదారుల నిర్మాణం దిశగా కృషి చేయాల్సిన పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని రహదారులు అధ్వానంగా మారాయి. కొత్త రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడంతో ప్రయాణికులు ప్రమాదకరంగా ఉన్న రోడ్లపైనే తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. చింతకుంట నుంచి సిరూగాపురం గ్రామానికి నేటికీ మట్టి రోడ్డు ఉంది. అది వర్షాకాలంలో బురదమయంగా తయారవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి మండలంలోని రహదారులను నిర్మించి రవాణా సౌకర్యం కల్పించాలని, ప్రయివేటు వాహనాదారుల దోపిడీకి అడ్డుకట్ట వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాగు పొంగి రాకపోకలు కట్


- రామాంజిని, సిద్ధాపురం గ్రామం



మా ఊరికి రావాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు గుంతలమయంగా ఉంది. అలాగే గూళ్యం దగ్గర కల్వర్టు చిన్నపాటి వర్షమొచ్చినా వాగు పొంగి మా ఊరికి రాకపోకలు నిలిచిపోతాయి. స్పందించి మా గ్రామానికి రోడ్డు వేసి కల్వర్టు తీసేసి బ్రిడ్జి నిర్మించాలి.

మరమ్మతులు చేపట్టాలి

- ధనుంజయ్, మాచనూరు గ్రామం



మా ఊరికి రోడ్డు వేసి దాదాపు 11 ఏళ్లవుతోంది. అప్పటి నుంచి ఇప్పటివరకు కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. హాలహర్వికి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. మా ఊరి బ్రిడ్జి తెగి దాదాపు 6 ఏళ్లవుతున్నా బ్రిడ్జి నిర్మించలేదు. మరమ్మతులు కూడా చేయలేదు. అధికారులు స్పందించి మా ఊరికి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

పారిశుధ్యంపై అవగాహన అవసరం

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పారిశుధ్యం పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సోమప్ప సర్కిల్, పార్కు రోడ్డు, మార్కెట్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెత్తను రోడ్లపై, మురుగు కాల్వల్లో వేయరాదని పేర్కొన్నారు. అనంతరం అన్న క్యాంటీన్‌లో అల్పాహార పంపిణీని తనిఖీ చేశారు. అక్కడ ప్రజలను నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. శుభ్రతను పాటించాలని సూచించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - నందవరం



నందవరం మండలంలో గల నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో దేశంలోని 13 ప్రముఖ కంపెనీలతో అవగాహన కుదుర్చుకుని ఉద్యోగాలు ఎమ్మిగనూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 8న ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఆయా కంపెనీల హెచ్‌ఒడిలతో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నారని చెప్పారు.

సమస్య వస్తే సమాచారమివ్వాలి : డీఎస్పీ

ప్రజాశక్తి - ఆదోని

సోదర భావంతో దేవర ఉత్సవాలు నిర్వహించుకోవాలని, ఏదైనా సమస్య తలెత్తిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ హేమలత సూచించారు. శుక్రవారంపేట శక్తి మాత మారెమ్మ రథోత్సవం ఊరేగింపు విషయంపై ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు నాగరాజు, దుర్గప్ప, తిమ్మప్ప మాట్లాడారు. ఈనెల 7, 8న పట్టణంలోని ఇస్వీ రోడ్డులో శక్తి మాత మారమ్మవ్వ దేవర ఉత్సవం ఉంటుందని తెలిపారు. దేవతకు జలాభిషేకం, కుంకుమార్చన, ఆకు పూజ, బలి సమర్పణ ఉంటుందని చెప్పారు. రథోత్సవం, భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించాలని కోరారు.


డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

'కంప్యూటర్ సైన్స్'కు అవకాశం కల్పించాలి

- డిప్యూటీ తహశీల్దార్ డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి- ఆలూరు

బీఎస్సీలో మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ చేసిన అభ్యర్థులకు స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) పోస్టుకు అవకాశం కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు షాకీర్, మండల కార్యదర్శి మైనా కోరారు. సోమవారం ఆలూరు తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకానికి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) విద్యార్హతకు సంబంధించి బీఈడీ (ఫిజికల్ సైన్స్) చేసిన అభ్యర్థులు డిగ్రీలో రెండు ఆప్షనల్ సబ్జెక్టులు ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా బీసీఏ (బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్) చేసిన వారు ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ ఉంటే స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) పోస్టుకు అర్హులని చెప్పారు. బీసీఏ (గ్రూపు చేసిన వారికి మ్యాథ్స్, ఫిజిక్స్ లేకపోయినా వారిని ఈ పోస్టుకు అర్హులుగా ప్రకటించిందన్నారు. ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, డిగ్రీలో మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ చేసిన వారికి ఎందుకు అర్హత కల్పించలేదో తెలియడం లేదన్నారు. డిగ్రీలో మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ చేసిన వారికి కూడా అర్హత కల్పించాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, నాయకులు సూరి, డీఎస్సీ అభ్యర్థి కృష్ణ పాల్గొన్నారు.


డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


చెన్నకేశవరెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు

దేవరకు ఏర్పాట్లు పూర్తి

- మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని నాగలదిన్నె గ్రామంలో జరిగే దేవర ఉత్సవాల నిర్వహణకు గ్రామ పెద్దలు, నాయకులు పెద్ద ఎత్తున సిద్ధమయ్యారు. ఉత్సవానికి ఏర్పాట్లను భారీగా చేశారు. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఆయన తనయుడు జగన్మోహన్ రెడ్డికి వైసిపి నాయకులు ఆహ్వాన పత్రిక అందించి ఆహ్వానించారు. దేవరలో కచ్చితంగా పాల్గొంటామని ఆయన తెలిపారు. తనకు నాగలదిన్నె గ్రామమంటే చాలా అభిమానమని, గ్రామస్తులు తన వెంట నడుస్తూ పార్టీకి విశేష సేవలు అందించారని చెప్పారు. అలాంటి ఊరిలో జరిగే మహోత్సవంలో పాలుపంచుకోవడం సంతోషకరమని తెలిపారు. వైసిపి నాయకులు పివి.రాజేష్ శెట్టి, క్యాతం నాగప్ప, రంగారెడ్డి, వీరేష్ పాల్గొన్నారు.

కలుషిత నీరు వదిలితే చర్యలు

- ఎంపిడిఒ వెంకటేశ్వర్లు
- ప్రజాశక్తి ఎఫెక్ట్
- చెరువును పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని తుమ్మిగనూరు, సాతనూరు గ్రామాల సమీపంలో ఉన్న చేపలు, రొయ్యల చెరువుల నుంచి కలుషితమైన నీటిని తుంగభద్ర నదిలో వదిలితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన 'తుంగభద్ర కలుషితం' అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల మండల అధికారులు చేపలు, రొయ్యల చెరువు దగ్గరికి వెళ్లి పరిశీలించారు. చేపల చెరువుల యజమానులతో మాట్లాడుతూ... చెరువుల నుంచి కలుషితమైన, రసాయనాలతో కూడిన నీటిని తుంగభద్ర నదిలో వదిలినా, మరే ఇతర చోట వదిలినా చర్యలు తప్పవని హెచ్చరించారు. చేపల చెరువుల నుంచి వస్తున్న నీటిని పరిశీలించారు. చెరువుల నుంచి వస్తున్న నీటిని, వంకలో కలుస్తున్న చోట, నది దగ్గర ఎస్ఎపి స్కీం వద్ద ఇలా మొత్తం మూడు చోట్ల నీటిని పరీక్షలకు పంపించామని అధికారులు తెలిపారు. ఈ పరీక్షలో కలుషితమని తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెదర్లాండ్ స్కీం నుంచి వస్తున్న తాగునీటిని సైతం పరీక్షలకు పంపినట్లు తెలిపారు. చెరువుల నుంచి ప్రతి మూడు నెలలకోసారి బయటకు వదిలే నీటిని అధికారులకు తెలియజేసి పరీక్షలు చేసిన తర్వాతే కిందికి వదలాలని చెప్పారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇఒఆర్‌డి హారున్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ తిమ్మ రాజు, మత్స్య శాఖ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పంచాయతీ సెక్రటరీ అయ్యస్వామి, గ్రామీణ మత్స్యశాఖ అధికారి చంద్రకళ, విఆర్ఒ బాలస్వామి పాల్గొన్నారు.


చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

శానిటేషన్‌పై రాజీ పడొద్దు

- మున్సిపల్ ఇన్‌ఛార్జ్ ఛైర్మన్ మహ్మద్ గౌస్

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని పరిసరాల పరిశుభ్రతపై రాజీ పడే ప్రసక్తే లేదని, పారిశుధ్య కార్మికులు అంకితభావంతో పనిచేయాలని మున్సిపల్ ఇన్‌ఛార్జ్ ఛైర్మన్ ముల్లా మహ్మద్ గౌస్, వైస్ ఛైర్మన్ నరసింహులు తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో శానిటేషన్ శాఖ పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. గార్బేజ్ కలెక్షన్, డంపింగ్ ప్రదేశాల నిర్వహణపై జాగ్రత్తలు వివరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్, సందీప్ రెడ్డి, బాలాజీ, అశోక్, వాసీమ్, ముంబతి స్వామి, భాస్కర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్

ఎఎన్ఎం, సూపర్‌వైజర్లపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - ఆస్పరి

ఎఎన్ఎం, సూపర్‌వైజర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు, సచివాలయ ఎఎన్ఎం, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గంటా సంధ్యారాణి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైద్య, ఆరోగ్యశాఖలో గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పిల డిమాండ్ల సాధనకు కొద్ది రోజులుగా ధర్నా చేస్తున్నారని తెలిపారు. సాటి ఉద్యోగులైన ఎఎన్ఎంలు, సూపర్‌వైజర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని మండి పడ్డారు. ఈ విధంగా సాటి ఉద్యోగులను కించపరుస్తూ, ఉద్యోగుల స్థాయిని దిగజార్చే విధంగా మాట్లాడటం సమాజసం కాదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఎఎన్ఎంలు, సూపర్‌వైజర్లను ఇబ్బందులకు గురి చేసిన ఎంఎల్‌హెచ్‌పిలపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిస్ట్ అసోసియేషన్ నాయకులు మనోహర్, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నాయకులు హరికృష్ణ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు రామకృష్ణ, ఎంపిహెచ్ఇఒ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, వసంత కుమారి, లక్ష్మీ కాంతమ్మ, ఎఎన్ఎంలు వీరమ్మ, లక్ష్మీదేవి, పద్మ, రాధా పాల్గొన్నారు.


నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఎఎన్ఎంలు, సూపర్‌వైజర్లు

క్యూ కట్టిన బాధితులు

ప్రజాశక్తి - ఆదోని

వారం వారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి అన్యూహ స్పందన వస్తోంది. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి అర్జీలు ఇచ్చేవారు క్యూ కట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అర్జీలను స్వీకరించారు. ఆదోని పట్టణం శివ శంకర నగర్ కాలనీలో వీధిలైట్లు, డ్రెయినేజీ సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు సరోజ, భారతి, హసీనా భాను కోరారు. మండగిరి గ్రామ పంచాయతీలోని సర్వే నెంబర్ 32లో 2.37 ఎకరాల భూమి ఉండగా ప్రస్తుతం ఆ భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, సర్వే నెంబర్ 30లో 2.48 ఎకరాల భూమి ఉండగా ప్రస్తుతం ఆ భూమి ఆన్‌లైన్‌లో 2.40 ఉందని, విచారణ చేసి భూమి సమస్యలను పరిష్కరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదోని పట్టణానికి చెందిన మధుసూదన్ కోరారు. తనకు సంబంధించి సర్వేనెంబర్ 440/2ఎలో 6.50 ఎకరాల భూమి, 440/2బిలో 4.20 ఎకరాల భూమి ఉండగా ప్రస్తుతం ఆ భూమికి సంబంధించి సర్వే చేసి హద్దులు చూపాలని గోనెగండ్లకు చెందిన జి.రాజు వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డిఎల్‌డిఒ రమణా రెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ షఫీవుల్లా, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ పద్మజ, ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, డిప్యూటీ డిఇఒ వెంకట రమణా రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వలీబాష ఉన్నారు.

నాటుసారాపై ఉక్కుపాదం : ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి - ఆదోని

నాటు సారా తయారు చేసినా, విక్రయించినా అలాంటి వారిపై ఉక్కు పాదం మోపుతామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ హెచ్చరించారు. నవోదయం 2.0లో భాగంగా సోమవారం ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆలూరు రోడ్డులో గల లక్ష్మమ్మ అవ్వ ఆర్చి వద్ద 20 లీటర్ల నాటుసారాను, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలూరు మండలం నెరనికితండాకు చెందిన పూజారి హరినాయక్ పారిపోగా అతని మీద కేసు నమోదు చేశామన్నారు. ఇప్పటికే నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తూ, సారా తయారు చేసే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. కొందరిని జైలుకు కూడా పంపామని వివరించారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

- ఎఒ జయలక్ష్మి

ప్రజాశక్తి - చిప్పగిరి

మంచి దిగుబడులు రావాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఎఒ జయలక్ష్మి రైతులకు సూచించారు. సోమవారం చిప్పగిరి పొలాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగస్వామి ఆధ్వర్యంలో ఎఒ జయలక్ష్మి భూసార నమూనా స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భూసార పరీక్షల వల్ల భూమిలో ఏ శాతం ఎంత ఉన్నది తెలుసుకోవచ్చున్నారు. భూసార పరీక్షలు చేయించుకునే రైతులు వారి పొలాల్లోకి వచ్చి రైతు సేవా అధికారి సమక్షంలో మట్టి నమూనా చేయించుకున్న నేపథ్యంలో ఆ రైతుకు ఒటిపి వస్తుందన్నారు. ఆ మట్టి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో దాదాపు 580 ఎకరాల్లో మట్టి నమూనాలను తీసుకుంటామని తెలిపారు. ఒక్కో రైతు సేవా కేంద్రానికి 67 ఎకరాల వరకు మట్టి నమూనాలను స్వీకరిస్తారని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు ప్రతాప్ నాయుడు, రాకేష్, జ్యోతిర్మయి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


భూసార పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

జిఒ 117తో విద్యావ్యవస్థ అతలాకుతలం

- ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యా వినాశకర జిఒ 117కు అమెండ్మెంట్స్‌గా తీసుకొస్తున్న విధానాలు విద్యారంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాటూరు రవికుమార్ తెలిపారు. సోమవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పాత తాలూకా కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు అర్బన్ శాఖ అధ్యక్షులు శ్రీనివాసులు అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి నాటూరు రవికుమార్ హాజరై మాట్లాడారు. 3, 4, 5వ తరగతుల విలీనాన్ని నిలిపేసి పాఠశాలలను పూర్వ స్థితిలో కొనసాగిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. హామీని నెరవేర్చకపోగా ఫౌండేషన్ పాఠశాలల పేరుతో కొన్ని పాఠశాలలను 1, 2వ తరగతులకే పరిమితం చేయడం ద్వారా ప్రాథమిక విద్య నిర్వీర్యం అవుతోందని మండిపడ్డారు. ఇప్పటికే జిఒ 117 కారణంగా గత విద్యా సంవత్సరం 11 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రయివేట్‌కు వలసబాట పట్టారని తెలిపారు. ప్రతి గ్రామంలో 1 నుంచి 5వ తరగతులతో కూడిన ప్రాథమిక పాఠశాల వ్యవస్థ, అలాగే 6 నుంచి 10వ తరగతి లేదా 12వ తరగతి తో కూడిన ఉన్నత పాఠశాల విధానాన్ని పునవ్యవస్థీకరించాలని డిమాండ్ చేశారు. జోన్ కన్వీనర్ పాపన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఖాసీంజీ, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 9న కర్నూలులోనూ, 14న విజయవాడ కేంద్రంలోనూ ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కౌన్సిలర్ పరశురాం, జిల్లా కార్యదర్శి రంగనాథ్, వీరేష్, జిల్లా ఆడిట్ కన్వీనర్ రాఘవేంద్ర, సభ్యులు హేమంత్ కుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బికె.శ్రీనివాసులు, హెచ్‌ఆర్.రాఘవరెడ్డి, మాదిగుండు నాగరాజు, పెద్దకడబూరు మండల ప్రధాన కార్యదర్శి జట్టప్ప, ఆస్పరి అధ్యక్షులు లక్ష్మన్న, సీనియర్లు రామన్న, మునిస్వామి, ప్రతాప్ సిన్హా, ఎంఎస్.మల్లికార్జున, కనికే నాగరాజు, నాగభూషణం, వీర నాగేంద్ర, ఆబిలి వెంకటేష్, ముచ్చిగిరి వీరేష్, రాజశేఖర్, పిబి.నారాయణ, వీరశేఖర్, బిఎస్.ప్రవీణ్, ఎం.ప్రవీణ్, కామర్తి శ్రీనివాసులు, బుట్టా శ్రీనివాసులు, బసవరాజు, లతీఫ్, చాంద్ బాషా, సిజి.ఈరన్న, చిలకలడోన ఈరన్న, శివ, నిఖిల్, గోవిందు, కెఆర్.వెంకటేశ్వర్లు, నారాయణపురం శ్రీనివాసులు, మేటి నరసప్ప, మధు, గోపీనాథ్, కిరణ్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.


ధర్నా చేపడుతున్న నాయకులు

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తహశీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలి సిపిఎం మండల కార్యదర్శి గోవిందు, నాయకులు రాముడు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, రైతులు, కార్మికులు పాసుపుస్తకాల కోసం, ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం, ఇంటి పట్టాల పేరు మార్పు కోసం, జనన ధ్రువీకరణ పత్రం కోసం, కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ నెలలు గడుస్తున్నా మంజూరు చేయడం లేదని తెలిపారు. రెవెన్యూ కార్యాలయ అధికారులు కొద్దిమందికే పని చేస్తున్నారని, పేదలు, మహిళలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. కేవలం ప్రేక్షకపాత్ర వహించడం సరైంది కాదన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో అధికారుల దగ్గర ఉన్న పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే బాధితులతో కలిసి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు ఎం.అబ్దుల్లా, యు.రమేష్, ప్రజా సంఘాల నాయకులు బి.కాలప్ప, మోహిన్, ఆటో బాష పాల్గొన్నారు.